# జ్యోతులు వెలిగించండి !

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

★ ★ ★

నేను తాగిలేను, గుడ్డివాణ్ణి కాదు, అదేనాకు చిక్కు. ఉన్న వున్నట్లు స్పష్టంగా కన్పిస్తాయి, విన్పిస్తాయి. అధర్మం, అన్యాయం పట్టాభిషిక్తులై ధర్మ పన్నాలు పలుకుతున్నాయి. నాకవి వినబడవే! ఆశ్చర్యం. అట్టడుగున, పీఠంకింద మూల్గుతున్న కపాలాల నోళ్లు కక్కుతున్న అగ్నిజ్వాలలు కన్పిస్తున్నాయి. సభలలో, సన్మానాలలో భూషణ వస్త్రాలంకృతులై నిలిచి సగర్వంగా సందేశాలిచ్చే మహామహుల రూపాలు కన్పించవే! ఆశ్చర్యం. రూపాలలోపలి గుండెల్లో కాపురమున్న పంజాలు, పడగలు విప్పిన లేచి నిద్రాముద్రితమైన లోకంమీదికి ఎగసిపడే గర్జనలు విన్పిస్తున్నాయి.

జీవయాత్ర సాగించే సాధారణులకు సముద్రగర్భంలో ఈదే తిమింగిలాలుకనబడవు. ఆకాశమవతల బహుశా రాజ్యంచేసే భగవంతుణ్ణి ధ్యానంచేసేవారికి ఆదివ్య మంగళవిగ్రహం, నృత్యఖేలనం, సంగీతం విన్పిస్తాయి. నేను రెండూ కాదు.

సమాజ సముద్ర మడుగున తిరిగే తిమింగలాలు, పగిలే అగ్ని పర్వతాలు కన్పిస్తున్నాయి నాకు. శూన్యంలో గోళాలు పరిభ్రమిస్తూ ఎప్పుడో భూమిని ఢీకొని పగల గొట్టాలని పన్నుతున్న కుట్రలు కన్పిస్తున్నాయి. నాకు భయంగావుంది.

*

భూమి — పశ్చిమాన్నుంచి తూర్పుకు; కాలం — గతంనుంచి భవిష్యత్తులోకి: ప్రయాణం చేస్తున్నాను. నడిచి నడిచి తూర్పున ఒక ప్రాంతానికి వచ్చాను. గతంనుంచి ప్రస్తుతంలోకి వచ్చాను. అడుగులు తడబడుతున్నాయి

కళ్ళలో చీకటి పేరుకుంటున్నది. ఆగాను.

విద్యుద్దీపాలున్నాయి. కాని, కనబడటం లేదు. వినపడటం లేదు, వీనులున్నాయి. కాని ఇదెక్కడి రాజ్యం ?!

యాత్రామధ్యంలో ఎన్నెన్ని దేశాలు, కాలాలు చూచానో! కొన్ని చోట్ల బానిసలపునుకల గల గలలు విన్పించాయి. రాజుల వైభవ కాంతులు కన్పించాయి. భూస్వామి రం కెలువిన్పించాయి. మరచక్రాల కసాయినృత్యం కన్పించింది. కాని-కాని-ఇది చీకటిరాజ్యం. ఎక్కడా ఎన్నడూ లేని వైపరీత్యం. ఈ చీకటే పురిటిపాపల గొంతు నులుము తోంది. వృద్ధులపై గోరీలు కప్పు తోంది. నరుల గుండెల్లో వెలిగే జ్యోతుల్నే నేలరాచి మసిచేస్తోంది. ఏమివింత !

నా జ్యోతి వెలుగుతూనేవుంది రహస్యంగా. చీకటిని కొద్దిగాచీల్చి చూచాను.

" స్వాగతం. సుస్వాగతం. పవిత్రభారతభూమి, ఋషులు తీర్చిన బాటలో ప్రపంచదేశాలకు ప్రథమశ్రేణిలో నిలిచి మిమ్మాహ్వానిస్తున్నది. హిమాలయోన్నత శిఖరాలు, సముద్రాంతర తీరాలు మా కెల్లలు. స్వాగతం !"

తెల్లని గోడకంటించిన ఈ పోస్టరు సగం చిరిగి వేళ్ళాడుతోంది.

ఐతే, రేడియోల్లో ఈస్వాగత వాక్యాలు వినబడుతూనే వున్నాయి. కాని, చుట్టూచీకటి రాజ్యం నిరాఘాటంగా సాగుతునే వుంది.

... ... ...

తోవనే నడుస్తున్నాను. గుండె లోనుండే జ్యోతిని జాగ్రతగా దాచుకుంటూ పల్లెవంకకు వెడు తున్నాను. డొంక. గట్లు. గట్ల మధ్య పొలాలు. పొలాలలో మంచెలు. మంచెలమీద వేళ్ళకు వొడిసెల తగిలించుకొని కాపలా వాళ్లు సిద్ధంగా వున్నారు. కాపలా ఎందుకు ? మెల్లగా కాపలా మని షిని పిలిచాను. అడిగాను.

నవ్వాడు. వెక్కిరిస్తూనవ్వాడు. ఈన్యాయం తెలియనివాణ్ణి అనా గరికుణ్ణి, జంతువుని అనుకొని వుంటాడు.

అనాదినాడే ఒక్కొక్క రైతూ ఈ భూమిని ముక్కలుగా కోసుకున్నారు. ఈగడ్డ మీద పంటతో అతను బ్రతుకుతాడు. మరొక గడ్డలోకి అతను ప్రవేశిస్తే ఊరుకోరు.

ఏంచేస్తారు ?

పోలీసు లొచ్చి ఈడ్చుకుపోతారు. ఖైదులో తోస్తారు.

ఐతే, ఆ నేలంతా కనుచూపు మేరవరకూ గట్లులేకుండా వుందే ?

అది జమీందారుది.

వీళ్లందరికీ చేరెడేసి ముక్కలు, అతనికి ఓ, అంతపెద్దదా? వాళ్లంతా ఏంచేస్తున్నారు ?

పొలంపని. దున్నుతారు, విత్తనం వేస్తారు, నీరుపోస్తారు, పండిస్తారు.

వాళ్లు దులుపుకుంటున్నారేం?

వెళ్లే సమయమయింది. మళ్లీ గింజలు పట్టుకుపోతే ఊరుకోరు. రోజు కూలిమాత్రం తీసుకోవాలి.

జమీందారేం చేస్తాడు ? వీళ్లే పంటంతా కోసుకుపోతే ?

జమీందారు డబ్బు లెక్క చూసుకుంటాడు. తాణేదారు మని ఆర్డరు కడతాడు. అతనిక్కడుండడు. రైతు గింజలు తీసుకుపోతే పోలీసు లొస్తారు.

వచ్చి ?

వచ్చి కాల్చుతారు. తుపాకులు, తూటాలు. కాపలాదారు తిరిగి వెళ్లాడు. బానిసలువందలు, వేలుగా ముందుకునడచి పోతున్నారు.

వాళ్లవెంట నేనూ వెళ్లాను. అందులో వాళ్లు తమ ఆప్తబంధువుల్ని గురించిగామాలు మాట్లాడుకుంటున్నారు.

"నిరుడు కరువొచ్చి వందమందిని తీసుకుపోయింది. ఈయేడు కలరావచ్చి యాభైమందిని తీసుకుపోయింది. సోలెడుగూడ మిగలా ఇవ్వనంటున్నాడు తాణేదారు."

"అనుకున్నదానికి సోలెడు గూడ మిగులివ్వకపోతే చూద్దాం తడాఖా."

" తాతల నాటినుంచి ఇట్లాగే వుంది. తరతరాలనుంచీ ఇట్లాగే వుంది. ఎవడికోసమిస్తాడో చూద్దాం. అసలీభూముల్ని మనంపండించాం. మనం బ్రతకాలి! "

ఈ మూడోవ్యక్తి గుండెలో రహస్యంగా జ్యోతి ఒకటి వెలుగు

తోంది. వాళ్ళందరినీ రచ్చబండ దగ్గర ఆగమన్నాడు. కూర్చు న్నారు. తీవ్రంగా చూస్తున్నారు. ఇంటికెందు కెళ్ళలేదా వీళ్ళంతానని నేను వెళ్ళి శోధించాను. ఇళ్ళల్లో పొయిలు లేవు. పొట్టుగూడ లేదు. అందుకని రచ్చబండ దగ్గర కూచు న్నారు.

నేను తిరిగి వచ్చేసరికి అతను జ్యోతిని ధగధగా వెలుగనిస్తు న్నాడు. చీకటి చిల్లి, వందల వద నాలు జేవురుగా మారాయి. వందల పిడికిళ్ళు ఊపిరితో ఉత్సా హంతో బిగుసుకున్నాయి. వాళ్ళు నిలబడ్డారు. నినాదాలిచ్చారు. నిప్పులు కురిపిస్తున్నారు. నడుస్తు న్నారు. పొలాలవంకకు నడుస్తు న్నారు.

గట్లు చీల్చుతారట. కట్టలు కోస్తారట. పొలాలన్నీ కలిపి, పంట సిరినృత్యం సాగిస్తారట. జ్యోతులు అన్ని వందల,వేల గుండెల్లో బాహాటంగా వెలుగుతున్నాయి. చీకటి పొదల్లోకి, గుహల్లోకిపోయి. దాక్కుంటున్నది.

ముందుకు నడుస్తున్నాను. చీకటి దేవతకు చీటీఅందిందేమో "టక్ టక్ "మంటూ బూట్లు నామసం నుగా పల్లెవేపు వెళుతున్నాయి తుపాకులు సన్నీలు లారీలలో నడుస్తున్నాయి. చీకటి దేవత తన అధికారం, అహంకారం నిలబెట్టు కోను దాడి వెడలింది.

నా జ్యోతిని రెండు చేతులతో కౌగిలించిదాచుకున్నాను. కన్నుల నుండి కిరణాలు ప్రసరిస్తాయని, పసిబడతారని కిందికి దించు కున్నాను. పెదవులు కుట్టివేశాను. చెట్టూపుట్టా దాటి వెళుతున్నాను.

కాలం దీనకంఠంతో అస్ప ష్టంగా పాడుతూ నాతో నేనడు స్తోంది. భూమిగౌరవర్ణంగా జాలిగా శోకం వెళ్ళబోసుకుంటూ పులకిస్తోంది. నడిచాను.

... ... ...

ఇక్కడ విద్యుద్దీపాలు పగలు గూడ వెలుగుతున్నాయి. జీవిత మాధుర్యాన్ని గూర్చి ఉపన్యా సాలుసాగుతున్నాయి. ఇదిపట్నం! పట్నవాసులంతా వీధుల్లోకివచ్చి ఒకరి వంక ఒకరుచూడకుండా ఎదురుపడుతూ తప్పుకుంటూ బెద

రిన గుంపులాగ ఎక్కడెక్కడికో వెడుతున్నారు. అది రైల్వేఅట. వెళ్లాను. దాన్ని మూడు తరగతులుగా విభజించారు. ఎందుకు? వెళ్లి చూచాను, ఆశ్చర్యం. అన్ని తరగతుల్లోను ప్రయాణీకులకు రెండేకళ్లు రెండే కాళ్లువున్నాయి. మరి తరగతులెందుకు? సినిమాలోకి వెళ్ళాను. అక్కడా అంతే. పుట్టు గుడ్డివాడికి లోకం చూడలేనని దిగులేలేదు! అలాగే యీ మనుష్యులకు విపరీతం ఏమీ కనబడడం లేదు!

ఎంత ఘోరమైనా వూహించుకో! అది లోకంలో జరగడానికి అవకాశం వుంది. వీళ్ల గుండెల్లో జ్యోతులు వయస్సు హెచ్చిన కొద్దీ ఆరి కొడిగట్టాయి. కిందతరగతిని పైతరగతి పలకరించదు. ప్రతిష్ఠ! మరి. పై తరగతిని కిందితరగతి దిగలాగదు. కర్మ! మరి. భయం! మరి.

పట్నంలో ఒకవంక పెద్ద భవనంలో ధీరోదారులు కొందరు సమావేశమైనారు. నోళ్లూ, కళ్లూ లేని ఈ మూఢప్రజల్ని పాలించటం వారి విధిగా ధర్మంగా ఊహించుకున్నారు. ఉన్న తరగతుల్ని ఎలా నిలబెట్టాలో, చీకటి రాజ్యాన్ని ఎలా శాశ్వతం చెయ్యాలో, జ్యోతులు వెలిగించే వారికి ఏయే శిక్షా స్మృతులు నిర్మించాలో తీర్మానిస్తున్నారు.

కొన్ని వేల తుపాకులు, కొన్ని వేల మందులు తయారుచేయిస్తున్నారు. కొన్ని కొత్తభవనాలు, కొన్ని కొత్త ఖైదులు నిర్మించమన్నారు. భూప్రదేశం గిరులు గీసి ఒకాయనకిచ్చారు. మిగిలినవాళ్లను వచ్చి ఆనకట్టలు కట్టమన్నారు. భూమిని పండించమన్నారు.

నేనుచూచి వచ్చిన పల్లెనుంచి పంటంతా రైలెక్కి వస్తున్నది. రైలుతోవ పక్క గ్రామాల్లో ప్రజలు తిండిలేక కుళ్లిపోతున్నారు.

ఇదేవిపరీతం!

పంటంతా పట్నంలో దిగింది. బండ్లమీద ఒక విశాలమైన యంత్రాగారంలో ప్రవేశించింది. ద్వారంవద్ద వేలకొలది వ్యక్తులు నిలబడ్డారు. మోకాళ్లవరకు పంచెలు, మోచేతులవరకు

చొక్కాలు, చేతుల గిన్నెల్లో జొన్న సంకటి. పనిలోకి చేర్చుకో మని ప్రాధేయపడుతున్నారు. పని లేదంటున్నారు.

అనుకున్నాను: పని లేదంటే ఏం? హాయిగా ఇంటికి వెళ్ళిపడుకో రాదా! తర్వాత తెలుసుకున్నాను గదా! పని లేనివాళ్లకు తిండిలే దని ప్రభుత్వం శాసించిందట! ఐతే? పనిమాత్రం లేదు.

ఇదే విపరీతం!

ఈ లక్షలాది ప్రజల గుండెల్లో జ్యోతులు లేవు. జీవంచచ్చిన ఈ జాతికి జీవితమే ఒక దుస్స్వప్నం లాంటిది. పనిచేసిన వాళ్లంతా ఈ నిర్జీవ యంత్రానికి ఆహుతౌతు న్నారు. ఈ క్రూరయంత్రమే ఎవ రినో, ఎక్కడో వున్నవాణ్ణి పోషి స్తోంది. ఈ మనుష్యులు దిక్కు లేక శిశువుల్లాగు ఏడుస్తున్నారు. చైతన్య జ్వాలతో వారిపైవిరుచుకు పడరు!

ఇదే విపరీతం!

'వెలిగించాలి, వెలిగించాలి, వెలిగించాలి' గుంపులలో కొందరు యువకుల గుండెలు ఇలాఘూర్ణిల్లు కుంటున్నాయి. ఆ గుండెల్లో జ్యోతులు ధగధగా వెలుగుతు న్నాయి. ఆ కాంతిలో వాళ్లకు తోవ కనపడుతోంది. మెల్లగా స్పష్టంగా పలకడంప్రారంభించారు.

"తిండి! తిండి! భవనాల్లో పంట వుంది. మనకు ఆకలౌతోంది. అది తీసుకుందాం. యంత్రాగారంలో మనమేగదా పనిచేసోంది, దీని ద్వారం మీద 'శేట్' పేరు వ్రాశారేం!! పత్రికలు, రేడి యోల ద్వారా పాలకుల వాక్కులు మనల్ని మోసం చేస్తు న్నాయి."

గుంపులు దించిన తలలెత్తాయి. యంత్రశాల కూతపెట్టింది. ఎవ్వరూ కదల్లేదు. గుంపులు యోచిస్తు న్నాయి. వ్యక్తుల నరాలు విహ్వా లించి కొత్త జీవంతో కంపిస్తు న్నాయి.

"మనం పుట్టాం భూమిమీద, ఈ భూమిమీదే మనం బ్రతకాలి. మనం పండించుకుంటాం, మనం తింటాం. వీళ్ళెవరు నీతులు చెప్పేం దుకు! వెలిగించుకోండి. ఇవిగో మా జ్యోతులు. కదలండి"

ఒక్కొక్కటే గుండెలు వెలిగాయి. గుంపంతా ఒక దివ్య జ్యోతిలా ప్రజ్వరిల్లి నాకళ్ళు మిరుమిట్లు గొల్పుతోంది. నేనూ వెంట నడిచాను. గుంపు నడదివ్వెలుగా కదులుతోంది.

గుంపు కంఠమెత్తింది. పాడుతోంది. పాలకుల బ్రతుకులకు తుదిగీతం పాడుతోంది. కాఠిన్యం పగిలిందేమో, కాలం తెల్లవారుతోంది. నిద్రమత్తు విడిందేమో, భూమి పులకరిస్తోంది. గుంపునడిచే అడుగులతో భూమి 'దడ దడ దడ' మోగుతోంది.

చుట్టుపక్కల దాగిన చీకటి సైన్యం దగ్గరగా వస్తోంది. మెల్లగా నిశ్శబ్దంగా, చుట్టూ కమ్ముతోంది. రేడియో గొంతుకతో చీకటిదేవత కేక వేసింది. చీకటిసైన్యం జ్యోతిని బంధిస్తోంది. గుండెలతో పోరాడుస్తోంది. గుంపుకళ్లు చుక్కల్లాగ తళతళ లాడుతున్నాయి. బాష్ప వాయువు చుట్టలు చుట్టలుగా లేచి కన్నులపై కెగబడింది. పత్రికలు చీకటి సైన్యాన్ని హర్షించాయి. చెయ్యమన్నాయి. "జ్యోతులు వెలిగితే ఇదేచిక్కు. కనపడ కూడనివి కనపడతాయి. వినపడకూడనివి వినపడతాయి. మూర్ఖ ప్రజలు తప్పుదారి తొక్కుతారు. చీకటి దేవతజ్యోతులగుండెల్ని చీల్చాలి."

ఒకటొకటిగా గుండెలు బద్దలై జ్యోతులారుతున్నాయి. సైన్యం జ్యోతులు రగిల్చిన యువకుల కోసం వేటాడుతోంది. నాడాల కింద, చక్రాలకింద చితికిన కళ్లు, ఎముకలు ప్రాణ శకలాలుగా మూల్గుతున్నాయి. నెత్తురు మెల్లగా నేలమీద పాకుతోంది. సంగీతం పాడుతోంది. తనజీవితం పూర్తి కాకముందే భూమి తల్లి వొడిలోకి పంపుతున్నందుకు చీకటిశక్తుల్ని శపిస్తోంది. పారిపోయే జ్యోతుల్ని తుపాకులార్పుతున్నాయి.

ఒక్క కేక. ఒక్క మూల్గు. ఒక్క శాపం. ఇలాగ కాలం రోదిస్తోంది. భూమి వొళ్లు గాయాలతో, పోట్లతో జ్వరంకాచి మూర్ఛపడింది.

... ... ...

నాజ్యోతిని శరీరమంతటా ప్రసరింపజేశాను. ధగధగ లాడుతు

న్నాను. కాని, తుపాకీలు సన్నీలు చూచి మళ్లీగుండెలో రహస్యంగా ఇముడ్చుకున్నాను. కళ్లుపాలిపోయి వేళ్ళు వొణుకుతూ చిన్ని దీపాన్ని జాగ్రతగా రక్షిస్తున్నాయి. చీకటి దేవతకు ఇంకా నా వాసన వెయ్యలేదేమో—తారాడుతూ తిరుగుతున్నాను.

పల్లె నుంచి, పట్నం నుంచి మళ్లీ ఒక దట్టమైన చీకటి తెర భూమిమీద వాలింది. కాలం ప్రస్తుతంలోనే నిలిచింది.

జ్యోతులు వెలిగించిన వాళ్ళందరినీ వేటాడి, పట్టితీసుకు పోతున్నారు. రోడ్లు గట్లు దాటి నేనూ వెంబడిస్తు న్నాను. వాళ్ల గుండెల్లో కాంతిని ఎక్కడ దాచుకున్నారో గాని, నిటారుగా నడుస్తున్నారు. వెనుక నుంచి రెండు వెకిలి నవ్వులు విన్పిస్తున్నాయి. యంత్రశాల ద్వారం మీద పేరు, తాణేదారు చిట్టా మీది పేరు నవ్వుతున్నాయి. వెనుకనుంచి దీనస్వరాలు మోగుతున్నాయి. పగిలిన గుండెలు వీళ్ల కోసం కేకలు పెడుతున్నాయి.

తోవ చీకటిలో తడిసి నడక సాగటంలేదు. ఆ తోవ గతంనుంచి ప్రస్తుతంలోకి సాగి వస్తోంది. నిశ్శబ్దంగా చుట్టూ తుపాకులు నడుస్తూ వీళ్లందరినీ ఈడ్చుకుపోతున్నాయి. కొందరు తూలి పడిపోతున్నారు. తోవంతా పురాస్మృతులతో, పునుకులతో నిండివుంది. అక్కడ సోక్రేటస్ తాగి విసిరిన విషపాత్ర పడివుంది. జీసస్ గాయాలొలికిన నెత్తురుబొట్లు నిప్పుల్లా వెలుగుతున్నాయి.

అవెవరి కంఠాలు!

లూథర్, టైలర్, గాబ్రియల్ పెరీల గుండె లింకా కేకలు పెడుతున్నాయి.

"జ్యోతులు వెలిగించండి"!!

□ □ □